## క్లుప్తంగా

### పీహెచ్‌సీకి వెళ్లే దారిలో మురుగు


పీహెచ్‌సీకి వెళ్లే మార్గంలో పేరుకుపోయిన మురుగునీరు

**పాచిపెంట:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే దారిలో మురుగునీరు పేరుకుపోయింది. మురుగునీటిలో నుంచే రోగులు ఆస్పత్రికి వెళ్తున్నారు. నూతనంగా నిర్మాణం చేపట్టిన బైపాస్ రోడ్డు ఆస్పత్రికి వెళ్లే రోడ్డు కంటే ఎత్తుగా మురుగు ఉండడం, కాలువలు కూడా లేకపోవడంతో వర్షపు నీరు అంతా రోడ్డుపైనే పేరుకుపోతోంది. పుట్టెడు కష్టంతో నిత్యం ఆస్పత్రికి వచ్చే వందలాదిమంది రోగులు, మురుగు నీటిలో నుంచి ఆస్పత్రికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులు దృష్టికి సమస్య తీసుకువెళ్లినా పరిష్కార మార్గం చూపడం లేదని సమీప ఇళ్ల ప్రజలు, ఆస్పత్రికి వచ్చే రోగులు వాపోతున్నారు. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

### ఎనిమిది గంటల పని హక్కుకు ప్రభుత్వం తూట్లు

- కార్మికుల నిరసన


పట్టణంలో నిరసన తెలుపుతున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు

**పార్వతీపురం టౌన్:** కార్మికుల ఎనిమిది గంటల పని హక్కుకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడిచిందని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పి.సంగం మండిపడ్డారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులు గురువారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికాగో కార్మిక వీరుల బలిదానాలతో సాధించిన ఎనిమిది గంటల పని హక్కు అమ్మేసే అధికారం మీకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. దుకాణాలు, ఫ్యాక్టరీల చట్టాలను సవరించే బిల్లును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాత్రి వేళల్లో మహిళలతో పని చేయించే నిర్ణయం ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐసీటీయూ కార్యదర్శి అజ్రపు దామోదర్ రావు, భవన నిర్మాణ కార్మికుడు ప్రసాద్, మహేష్, గౌరీ శంకర్, రాము, కృష్ణ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### 104 సేవలపై ఆకస్మిక తనిఖీ


మూలవలసలో రికార్డులు పరిశీలిస్తున్న 104జిల్లా మేనేజర్ కృష్ణ

**మక్కువ:** మండలంలోని మూలవలస గ్రామంలో 104 సిబ్బంది నిర్వహించిన మెడికల్ క్యాంపును 104 జిల్లా మేనేజర్ ఎస్.కృష్ణ గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. వైద్యశిబిరం వద్ద రోగుల వివరాలు, మందుల నిల్వలు, 104 వాహనం పరిస్థితిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు 104 ద్వారా వైద్యసేవలు అందించాలని చెప్పారు. రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వాహనం కండిషన్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించి, ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని కోరారు. కార్యక్రమంలో ఆపరేటర్ ఎగ్జిక్యూటివ్ మురళీకృష్ణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

### మిశ్రమ పంటలతో రైతులకు బహుళ ప్రయోజనాలు


మాట్లాడుతున్న ఏఓ ఎస్.అవినాష్

**సీతానగరం:** మండలంలోని ఆరుతడి భూముల్లో రైతులు మిశ్రమ పంటలు సాగు చేయడం వల్ల బహుళప్రయోజనాలు పొందవచ్చని మండల వ్యవసాయశాఖ ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు గుచ్చిమి, చిన్నారాయుడుపేట, సీతారాంపురం గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మిశ్రమ పంటలను గురువారం సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంది పంటలో పెసర, మినుము పంటలు వేయడం వల్ల పెట్టుబడి పెట్టినా ఆర్థికంగా కలిసి వస్తుందని, కలుపు నివారణకు దోహద పడుతుందన్నారు. పెరుగుతున్న కూలీల ఖర్చు, పనులకు కూలీల కొరత కారణంగా మిశ్రమ పంటలు వేయడంతో వేతనదారుల ఖర్చులకు ఉపయోగపడతాయని కలుపు మొక్కలు మొలకెత్తకుండా ఉంటాయని తెలియజేశారు. కార్యక్రమంలో మిశ్రమపంట సాగురైతులు పాల్గొన్నారు.

# అన్నదాతకు కష్టకాలం

- అవసరానికి అందుబాటులో లేని ఎరువు
- ఇంకా వేధిస్తున్న యూరియా కొరత
- రైతులకు తప్పని పడిగాపులు


మన గ్రోమోర్ వద్ద యూరియా కోసం పడిగాపులు పడుతున్న రైతులు

**బలిజిపేట:** ఖరీఫ్ సీజన్ పూర్తికావడానికి సిద్ధంగా ఉన్నా రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా యూరియా కొరత రైతులను వేధిస్తోంది. గురువారం వెంగాపురం పరిధిలో ఉన్న మన గ్రోమోర్ వద్ద యూరియా పంపిణీ చేస్తున్నారని తెలిసి రైతులు నానా ప్రయాసలు పడి ఒక బస్తా కోసం నిరీక్షించాల్సి వచ్చింది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఉబాలు ముందు వెనుక అవడంతో ఎరువుల అవసరాలను బట్టి రైతులు యూరియాను కొనుగోలు చేసుకుందామనుకున్నా సకాలంలో వారికి అందుబాటులో లేదని చెబుతున్నారు. రైతు సేవా కేంద్రాల్లో అవసరమైనన్ని యూరియా బస్తాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడ యూరియా ఇస్తామంటే అక్కడికి పరుగులు తీస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం గతంలో కంటే ఎక్కువే యూరియా వచ్చిందని చెబుతున్నా రైతులు మాత్రం అవస్థలు పడుతుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. దీనిని బట్టి యూరియా మండల హద్దులు దాటి పక్క గ్రామాలకు వెళ్లిందా అన్నది చర్చనీయాంశమైంది. గత ప్రభుత్వ హయాంలో మే నెల చివరిలోగానే రైతు భరోసా కేంద్రాలకు కాంప్లెక్స్ ఎరువులను తరలించి పుష్కలంగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. మండలంలో ఖరీఫ్ సీజనుకు మొదటి విడతగా యూరియా, డీఏపీ ఎరువులు ఎక్కువగా అవసరం ఉంటుంది. మండలంలో 20సచివాలయాల పరిధిలో రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వాటికి ఎరువులు సంపూర్ణంగా రాకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.


ఉభాలు చేసిన పంటపొలాలు

### పట్టించుకోని ప్రభుత్వం

యూరియా మార్కెట్‌లో లభించడం క్లిష్టతరమైనప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఖరీఫ్ ప్రారంభంలో ఎరువులకు డిమాండ్ ఉంటుందని తెలిసిన ప్రభుత్వం ఎరువులను అందుబాటులో ఉంచకపోవడంతో తీవ్రంగా కొరత ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. అదేవిధంగా రైతుల అవసరాలకు సరిపడా నిల్వలను తెప్పించడంలో సర్కారు విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- మండలంలో ఖరీఫ్ సాగువిస్తీర్ణం 21వేల ఎకరాలు
- అందులో వరిసాగు 18వేల ఎకరాలు
- యూరియా ఇండెంట్ పెట్టింది 1,510మెట్రిక్ టన్నులు
- ఇప్పటికి వచ్చింది ఆర్‌ఎస్‌కేలకు 710మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ షాపులకు 699మెట్రిక్ టన్నులు, పీఏసీఎస్‌లకు 92మెట్రిక్ టన్నులు.
- మొత్తం 1501మెట్రిక్ టన్నులు వచ్చినట్లు అధిదికారులు లెక్కలు చూపిస్తున్నారు. అయితే రైతులు మాత్రం యూరియా విషయంలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### గతంకంటే ఎక్కువే వచ్చింది

గతం కంటే యూరియా ఎక్కువే వచ్చింది. పట్టుకు వెళ్లినవారే తిరిగి రావడం, మొక్కజొన్న పంట 2వ విడతకు కొంతమంది రైతులు ఇప్పటినుంచి దాచుకునేందుకు వచ్చి తీసుకోవడంతో యూరియా కొరతలా అనిపిస్తోంది. ప్రతి రైతుకు యూరాయా పంపిణీ జరిగింది. **శివగణేష్, ఏఓ, బలిజిపేట**

# కేంద్ర పథకాలపై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్ రాజు

**పార్వతీపురం టౌన్:** కేంద్ర ప్రభుత్వ పథకాలను యువతకు చేరువ చేయడమే లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనువాస రాజు తెలిపారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ పథకాలను యువతకు చేరువ చేయడం వాటిని ఉపయోగించుకుని ప్రయోజనం పొందేలా వారిని ప్రేరేపించే ప్రాముఖ్యత గురించి వివరించారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మేరా యువభారత్ నిర్వహించిన ఈ కార్యక్రమం భాస్కర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలపై మున్సిపల్ కమిషనర్ ఒక పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్, స్కిల్ ఇండియా మిషన్, జల జీవన్ మిషన్, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన, ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, ప్రధానమంత్రి ఉజ్వల యోజన, అటల్ ఫంక్షన్ యోజన స్టాండ్ అఫ్ ఇండియా, స్వచ్ఛభారత్ మిషన్, ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన, ప్రధానమంత్రి కిసాన్ క్రెడిట్ కార్డ్, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, డిజిటల్ ఇండియా, ప్రధానమంత్రి ఉపాధి సృష్టి కార్యక్రమం, ప్రధానమంత్రి ముద్ర యోజన, తదితర పథకాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు ద్వారా తెలియజేశారు. ఈ పథకాలపై పూర్తి వివరాలను, వాటి ప్రాముఖ్యాన్ని, విధివిధానాలు విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా పథకాలపై విడుదల చేసిన పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పి.దిలీప్ కుమార్, ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారి, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎన్. విజయ్ స్వరూప్, అడిషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎం.కంచి బాబు, డిప్యూటీ రీజనల్ మేనేజర్ వై.భరత్ కుమార్, భాస్కర్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ సురేష్, పాండ్రంకి సంతోష్ కుమార్, సామాజిక కార్యకర్త ఆకుల శ్రీనివాస్ రావు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వడ్డీలేని రుణాలు ఇవ్వండి

- శ్రామిక మహిళా సంఘాల డిమాండ్


ప్రజాసంఘాల కార్యాలయంలో మాట్లాడుతున్న ఇందిర

**బలిజిపేట:** ఆర్థికంగా బలహీనంగా ఉన్న మహిళలను ఆదుకునేందుకు డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం వడ్డీలేని రుణాలు మంజూరుచేయాలని, అదేవిధంగా అన్ని రంగాల్లో మహిళలపై జరుగుతున్న వేధింపులను అరికట్టాలని శ్రామిక మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఇందిర డిమాండ్ చేశారు. ఈ మేరకు బలిజిపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో యు.లక్ష్మి అధ్యక్షతన ఐద్వా మండల మహాసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాంకులు రుణాలపై అధిక వడ్డీలు వసూలు చేస్తున్నాయని, ప్రభుత్వ సహకారం లేకపోవడంతో మహిళలు మైక్రో ఫైనాన్స్ సంస్థల నుంచి అధిక వడ్డీలకు అప్పులు వాడి అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కష్టపడి సంపాదించింది తిండిలేకపోయినా వడ్డీలకు చెల్లిస్తున్నారన్నారు. మహిళలను ఆర్థికంగా ఆదుకోవాలంటే వడ్డీలేని రుణాలను సంఘాలకు మంజూరుచేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్రామాల్లో మద్యం బెల్ట్‌షాపులను ప్రభుత్వం అరికట్టాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు మాట్లాడుతూ మహిళా కార్మికులను పెద్ద ఎత్తున వారు చేస్తున్న విధుల నుంచి తొలగిస్తున్నారని, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను ఖండించాలని, మహిళలు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏడుగురితో కూడిన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా యు.లక్ష్మి, కార్యదర్శులుగా వై.సుధ, ఎల్.కళావతిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

# రైతుల పక్షాన పోరాడాలి


సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి

**బలిజిపేట:** నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నందున రైతుల పక్షాన నిలిచి పోరాటాన్ని కొనసాగించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి అన్నారు. ఈ మేరకు బలిజిపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో జి.బలరాం అధ్యక్షతన గురువారం జరిగిన రైతు సంఘం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండిస్తున్న పంటకు మద్దతు ధర ప్రకటించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. రైతులకు నష్టం కలిగించే మూడు నల్ల చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తే రాష్ట్ర ప్రభుత్వం దానికి మద్దతు తెలుపుతోందని మండిపడ్డారు. యూరియా, ఎరువులు సక్రమంగా అందుబాటులో ఉంచలేదన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు లేక రైతులు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేసి వ్యవసాయం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో రైతులు దివాలాతీసే పరిస్థితి ఎదురైందని, రైతాంగానికి అండగా ఉండి ఐక్యంగా ఉద్యమించి పోరాడాలని పిలుపునిచ్చారు.

**13మందితో నూతన మండల కమిటీ**

మండల రైతు సంఘం నూతన కమిటీని 13మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మండల గోవింద, కార్యదర్శిగా ఆవు సాంబమూర్తిలతో పాటు సభ్యులు ఉన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు జి.సత్యనారాయణ, సీఐటీయూ జిలా ప్రధాన కార్యదర్శి మన్మథరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

### హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజా సంఘాల హెచ్చరిక

**పాచిపెంట:** హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్ణయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనక్కి తీసుకోవాలని గిరిజన ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ఈ మేరకు పాచిపెంట మండలంలోని శతాబి గ్రామంలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో తంగలం, గరిసెగుడ్డి, మూటకూడు తదితర పంచాయతీల్లో సుమారు 25 గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలను జల సమాధి చేయాలని చూస్తే, ఊరుకునే పరిస్థితి లేదన్నారు. రాజ్యాంగంలో ఆదివాసులకు అడవులు, భూములు, నీటి వనరులపై ,ప్రత్యేక హక్కులు కల్పించి ఉన్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మించేందుకు జీవో నంబర్ 51 జారీ చేసిందన్నారు. ఈ జీవో ఆధారంగా చింతపల్లి, కొయ్యూరు, జీకే వీధి, హుకుంపేట, అరకు వ్యాలీ, అనంతగిరి, పాచిపెంట మండలాల్లో 9 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం, కార్పొరేట్, ప్రైవేట్ కంపెనీలకు, సుమారు పదివేల ఎకరాల అటవీ, వ్యవసాయ భూములను చంద్రబాబు ప్రభుత్వం కేటాయించిందని, 250 గ్రామాల్లో 50వేల ఆదివాసీ ప్రజానీకం పండించే కాఫీ, మిరియాలు, మొదలు అటవీ, వ్యవసాయ ఉత్పత్తులన్నీ జల సమాధి అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**27న అరణ్య గర్జన**

ఇప్పటికే ఆదివాసుల అరణ్య గర్జన సభ పేరుతో సెప్టెంబర్ 22న సీలేరులో జీపుయాత్ర ప్రారంభించామని ఏజెన్సీవ్యాప్తంగా ఏడు రోజుల పాటు పర్యటన చేసి 400 కిలోమీటర్లలో గ్రామాలను సందర్శిస్తూ సెప్టెంబర్ 27న అరణ్య గర్జన సభ పేరుతో హుకుంపేట మండలం, బూర్జ పంచాయతీ, మజ్జి వలస గ్రామంలో సభ నిర్వహిస్తున్నామన్నారు. గిరిజన ప్రాంత ప్రజానీకం తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో అల్లూరి జిల్లా సీపీఎం కార్యదర్శి పి.అప్పలనరసియ్య, పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శులు కె.గంగునాయుడు, పోరాడ ఈశ్వరరావు, గిరిజన ప్రజా సంఘం నాయకులు పి.పండు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

# బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడదాం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ కార్యదర్శి తోట జీవన్

**పార్వతీపురం టౌన్:** 13 గంటల బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడదామని సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి తోట జీవన్ అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డబుల్ ఇంజిన్ ప్రభుత్వ కార్పొరేట్ సేవకు వ్యతిరేకంగా నిలుద్దామన్నారు. రాష్ట్రప్రభుత్వం శాసనసభలో నాలుగు కార్మిక వ్యతిరేక బిల్లులను ఆమోదించిందని వాటికి చట్ట రూపం వచ్చిందని, పరిశ్రమలు, కార్యాలయాల్లో 13 గంటల పని విధానాన్ని చట్టబద్ధం చేశారన్నారు. రాత్రిపూట కూడా మహిళలు పనిచేయడానికి అనుకూలంగా చట్టాలను సవరించారని ధ్వజమెత్తారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ, డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అని చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్లను నిస్సిగ్గుగా బలపరచడమే కాకుండా దానికి అనుకూలంగా రాష్ట్రంలో చట్ట సవరణలకు పూనుకుందని మండిపడ్డారు. దీనికి వ్యతిరేకంగా యావత్ శ్రామిక వర్గం ప్రజానీకం పోరాడవలసిన కర్తవ్యం ఉందని పిలుపునిచ్చారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**పార్వతీపురం టౌన్:** పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గోపాలరావు నాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్తవలస ఫీడర్, పార్వతీపురం టౌన్ ఫీడర్ 11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మలు, లైన్ల నిర్వహణ పనులు జరుగుతాయని తెలిపారు. కొత్తవలస ఫీడర్ పైన కొత్తవలస, నవిరి, గిజబ, సాయిరాం కాలనీ, వివేకానంద కాలనీ కొత్తపోలమ్మ కాలనీ, టౌన్ ఫీడర్ పైన ఉన్న ఇంద్ర కాలనీ, ఓల్డ్ రిలే వీధి టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డు, వేమకోటి వారి వీధి, గెంబలి వీధి, జగన్నాధపురం, శంఖ వీధి, రెడ్డి వీధి, రాయగడ రోడ్, సారిక వీధి, గుప్త మెడికల్ షాపు రోడ్, దేవి నగర్, కృష్ణాపల్లి, బైపాస్ కాలనీ, కేఎంహెచ్ రోడ్ వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఈ ప్రాంతాల్లోని ప్రజలు అంతరాయానికి సహకరించాలని కోరారు.

**బలిజిపేటలో..**

**బలిజిపేట:** మండలంలో 11కేవీ లైనుకు సంబంధించి బలిజిపేట టౌన్, బలిజిపేట రూరల్, పెదపెంకి ఫీడర్లలో చెట్లను తొలగించేందుకు గాను శుక్రవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నందున వినియోగదారులు సహకరించాలని ఏఈ సింహాచలం కోరారు. బలిజిపేట, వెంగాపురం, తుమరాడ, పలగర, మిర్తివలస, చెల్లెంపేట, బర్లి, సుభద్ర, బడేవలస, శివరాంపురం, పణుకువలస, అరసాడ, పదమాయవలస, పి.చాకరాపల్లి గ్రామాలకు, నారాయణపురం, రావివలస, గౌరీపురం, పెద్దింపేట, పోలినాయుడువలస, గీతనాపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. దీనిని గమనించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

# కాత్యాయని దేవి అవతారంలో దుర్గమ్మ


సీతానగరం: తహసీల్దార్ ఆఫీసు సమీపంలో కాత్యాయిని అలంకరణలో అమ్మవారు


బలిజిపేట: అమ్మవారిని కాత్యాయని దేవి అవతారంలో అలంకరించి చేసిన పూజలు


సీతానగరం: బగ్గందొరవలసలో కొలువైన కాత్యాయిని అలంకరణలో దుర్గాదేవి


పార్వతీపురం రూరల్: సంగంవలసలో కాత్యాయని దేవి అవతారంలో కోటదుర్గమ్మ

**బలిజిపేట:** మండలంలోని అజ్జాడలో శ్రీ విజయ దుర్గా భవాని ఆలయంలో అమ్మవారిని కాత్యాయని దేవి అవతారంలో అలంకరించి పూజలు చేశారు. అర్చకులు బి.రామలింగస్వామి, ఆధ్వర్యంలో గురువారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

# ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం నిర్మాణం


ఎన్నికైన నూతన కార్యవర్గం

**పార్వతీపురం టౌన్:** జిల్లాలో ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరమ్ నూతన కార్యవర్గాన్ని స్థానిక డీవీఎంఎం ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ మేరకు జిల్లాలోని భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు సమావేశమై సామాన్య ప్రజలకు సైన్స్ చేరేలా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే ఈ ఫోరం ద్వారా ఉపాధ్యాయులకు కావాలిన్సిన అన్ని అంశాలు, విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ అంటే భయం పోగొట్టేలా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఉపాధ్యాయులు అందరు ఏకగ్రీవంగా జిల్లా ఫిజికల్ సైన్స్ ఫోరం అధ్యక్షుడిగా గిరడ లక్ష్మణ రావును, ప్రధాన కార్యదర్శిగా పూడి అశోక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ట్రెజరర్‌గా బెహరా సంతోష్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్స్‌గా హరి ప్రసాద్, కోట అయ్యప్పలు ఎన్నికయ్యారు. ఫోరం ఉపాధ్యక్షులుగా ఎ.కేశవరావు, జాయింట్ సెక్రటరీగా ఆర్.సతీష్ రాజును ఎన్నుకున్నారు.

# గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి


ఇప్పలవలసలో టీకాలు వేయిస్తున్న ఎ.డి డాక్టర్ బి.శ్రీనివాసరావు

**సీతానగరం:** పశువైద్యశాఖ ఆధ్వర్యంలో రైతుసేవా కేంద్రాలవద్ద జరుగుతున్న గాలికుంటువ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పశువు ఉన్న రైతులు తమ పశువులకు వేయించాలని పశుసంవర్ధక శాఖ ఎ.డి బి.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మండలంలో గురు వారం మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.రామారావు ఆధ్వర్యంలో నిడగల్లు, ఇప్పలవలస, పాపమ్మవలస గ్రామాల్లో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని డాక్టర్ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి బలిజిపేట, సీతానగరం మండలాల్లో డాక్టర్లు బి గణేష్, రామారావుల ఆధ్వర్యంలో టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. సీజన్‌లో వచ్చే గాలికుంటు వ్యాధి కారణంగా ముందు జాగ్రత్త చర్యగా టీకాలు పశువులకు రైతుసేవా కేంద్రాలు, రచ్చబండల వద్ద వేస్తున్నట్లు తెలియజేశారు. టీకాల కార్యక్రమాన్ని పశువులున్న రైతులు వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు, గోపాల మిత్రలు పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్‌డీఎంఎఫ్ గ్రాంట్‌లో పనులు మంజూరు

- ఎస్‌జీఎల్‌టీబీపీ ఈఈహెచ్ మన్మథరావు

**సీతానగరం:** తోటపల్లి జలాశయం కుడి కాలువ గట్టు నిర్వహణ కోసం ఎస్‌డీఎంఎఫ్‌లో పనులు మంజూరు చేశామని, ఎస్‌జీఎల్‌టీబీపీ ఈఈహెచ్ మన్మథరావు తెలిపారు. ఈనెల 25వ తేదీన సాక్షిలో ప్రచురితమైన 'ప్రమాదపుటంచుల్లో తోటపల్లి కాలువ గట్టు' కథనానికి స్పందిస్తూ ఆయన వివరణ ఇచ్చారు. తోటపల్లి జలాశయం కుడి కాలువ గట్లు ప్రామాణిక ఎత్తుకు ఉండేటట్లు చేయవలసిన అన్ని పనులు 2025 ఖరీఫ్ పంటకు నీటి విడుదల చేయడానికి ముందుగానే ప్రభుత్వం చేపట్టిందన్నారు.

# వైద్యసేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీపీ బి.ప్రమీల


వైద్య శిబిరంలో రోగులతో మాట్లాడుతున్న ఎంపీపీ బి.ప్రమీల


ర్యాలీలో పాత కలెక్టర్ ఫొటోతో ఉన్న ఫ్లెక్సీ


రోడ్లపై చెత్త ఊడుస్తున్న ఎంపీపీ బి.ప్రమీల, ఏఎంసీ చైర్మన్ మండల అధికారులు

**పాచిపెంట:** స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఎంపీపీ బి.ప్రమీల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యసేవలను ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని కోరారు. చిన్నపాటి జ్వరాలు వచ్చినా అశ్రద్ధ చేయకుండా స్థానిక వైద్య సిబ్బందిని సంప్రదించి వారి ద్వారా పీహెచ్‌సీలకు వచ్చి వైద్యం చేయించుకోవాలని సూచించారు. అలాగే ఆస్పత్రిలో వైద్యసిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సాలూరు నియోజకవర్గ ప్రోగ్రాం ఆఫీసర్ శివకుమార్, దంత వైద్య నిపుణురాలు స్వర్ణలత, పాచిపెంట పీహెచ్‌సీ వైద్యాధికారి రవిచంద్ర, స్థానిక ఎంపీటీసీ దండి ఏడుకొండలు, సీడీపీఓ బొత్స అనంతలక్ష్మి, వైద్య, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

**పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం**

**పాచిపెంట:** పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం సాధ్యమవుతుందని ఎంపీపీ బి.ప్రమీల అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన స్వచ్ఛోత్సవ్.స్వచ్ఛతా 'హి' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా మండల అధికారులతో కలిసి రోడ్ల పైన చెత్తను ఊడ్చారు, అనంతరం ర్యాలీ చేపట్టి పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను ప్రజలకు తెలియజేశారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ, ఎంపీడీఓ బీవీజే పాత్రో పంచాయతీ విస్తరణ అధికారి మల్లేశ్వరరావు, సీడీపీఓ బొత్స అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

**పాత కలెక్టర్ ఫొటోతో ఫ్లెక్సీలు..**

పై నిర్వహించిన స్వచ్ఛోత్సవ్..స్వచ్ఛతా 'హి' కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా పాత కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఉన్న ఫొటోలతో పాత ఫ్లెక్సీలు దర్శనమిచ్చాయి, జిల్లాకు కొత్త కలెక్టర్ వచ్చి సుమారు 15 రోజులు గడుస్తున్నా మండల అధికారులు పాత కలెక్టర్ ఫొటో ఉన్న పాత ఫ్లెక్సీలతో ర్యాలీ చేపట్టడం చర్చనీయాంశంగా మారింది.